# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## ఎవుసం తెలువనోళ్లు గిట్లనే అంటరు..

రేగొండ, నవంబర్ 21 : ఎద్దు ఎవుసం తెలియని వాళ్లకు రైతుల గురించి మాట్లాడే హక్కులేదు. 10 హెచ్‌పీ మోటరు అంటే మామూలా ? వాటిని వాడితే నిత్యం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. రేవంత్ రెడ్డి ఏసీ రూంలో పడుకొని ఎవుసం గురించి మాట్లాడుతున్నడు. ఎక్కడో ఉండి 3 గంటల కరెంట్ చాలు, 10 హెచ్‌పీ మోటర్లు అని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నడు. ఇక్కడి రైతులు 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు మాత్రమే వాడుతరు. ఎందుకంటే ఇక్కడ బావులు లోతుగా ఉండవు, నీళ్లు పుష్కలంగా ఉంటయి. ఇప్పుడు 10హెచ్‌పీ మోటర్లు కొనాలంటే రైతులకు అధిక భారమవుతుంది. ఒకవేళ వాడితే అవి కాలిపోయి వారం రోజుల వరకు రిపేరు కావు. దీంతో చేతికి వచ్చిన పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలు కావాల్సి వస్తుంది. కేసీఆర్ సారు రైతుల కష్టాలు తెలిసిన కుటుంబంలో పుట్టి పెరిగిండు కాబట్టి మాకు మేలు చేసే పథకాలు తీసుకొస్తున్నడు. ఆయను కాపాడుకుంటం.

*– కొక్కు మొగిలి, నిజాంపల్లె, రేగొండ*



## వ్యవసాయాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదు

మంగపేట, నవంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వ్యవసాయాన్ని పట్టించుకోలేదు. ఎన్నికల్లో లబ్ధిపొందడానికే రైతులను మభ్యపెడుతున్నారు. వాళ్లు ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప వ్యవసాయ రంగం బాగుపడడానికి ఏ ఒక్క పథకం అమలు చేయా లె. విత్తనాలు, ఎరువులు మొదలుకొని పంటలు అమ్మకానికి కూడా రైతులు అరిగోస పడ్డరు. సీఎం కేసీఆర్ కారణంగానే రైతులు సంతోషంగా బతుకుతున్నారు. 24 గంటల కరెంట్‌తో 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ వాడుకుంటూ పంటలు పండించుకుంటున్నరు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు వాడి పంటలకు నీళ్లు పెట్టమంటున్నరు. అవి వాడితే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి కాలిపోతాయి. బావులు, బోర్లలో చుక్క నీళ్లు ఉండవు. వ్యవసాయం మీద అవగాహన లేకనే వాళ్లు ఇలా మాట్లాడుతున్నరు.

*– దిడ్డి శ్రీనివాస్, చెరుపల్లి, మంగపేట*

## 3 గంటలతో 20 గుంటలు పారదు

ములుగు, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : మూడు గంటల కరెంట్ తోని 20 గుంటలు కూడా పారదు. అందునా 10హెచ్‌పీ మోటర్లు అనడం తెలివి తక్కువ తనం. ఇప్పుడు ఉన్న 24గంటల కరెంటే కావాలి. ఒక్కోసారి ఎకరం భూమికి బోర్లలో నీరులేక సరిగా పొలానికి పారవు. మళ్ల సైపన్ పైపులు వేసి చెర్లకెల్లి నీళ్లు పారించుడు అయితది. 10హెచ్‌పీ మోటర్లు పెడితే నీరు ఎక్కడి నుంచి వస్తది. తెలంగాణ వచ్చినంక ఇప్పుడిప్పుడే రైతులు బాగు పడుతున్నారు. కాంగ్రెసోళ్లు మమ్ములను గెలిపించండి నాణ్యమైన కరెంటు ఇస్తమంటున్నరు. కేసీఆర్ 24 గంటలు ఇస్తున్నడు కదా.. కొత్తగా వాళ్లు ఇచ్చేదేంది. అయినా వాళ్లను నమ్మబుద్ధి కావడంలేదు. నడిచేదాన్ని నడువనియ్యాలే. కేసీఆర్ వచ్చినప్పటి నుంచి రైతులకు మంచే చేస్తున్నడు.

*– పోరిక బావ్‌సింగ్, బండారుపల్లి, ములుగు మండలం*



## రైతుల జీవితాలతో ఆడుకోవద్దు..



కృష్ణకాలనీ, నవంబర్ 21 : మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అని కాంగ్రెసోళ్లు రైతుల జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్నరు. కాంగ్రెసోళ్లకు ఎవుసంపై అవగాహన లేదు. 47 ఏండ్లు అధికారంలో ఉన్నా రైతులకు పంట పెట్టుబడి సహాయం ఇయ్యాలనే ఆలోచన రాలేదు. అసలు 3 గంటల కరెంట్‌తో ఎకరం భూమి ఎలా పారుతుందో వాళ్లే చూపించాలి. 10 హెచ్‌పీ మోటర్లను అందరూ ఒకే సారి ఆన్‌చేస్తే లోడు పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయనే కనీస జ్ఞానం కూడా లేదు. సీఎం కేసీఆర్ రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కాబట్టి రైతుల ఇబ్బందులు తెలుసు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్యను తీర్చిండు. ఎవుసానికి 24 గంటలు కరెంట్ ఇస్తుండు. పెట్టుబడి సాయం, సాగు నీరు, 24 గంటల కరెంటు ఇవ్వడంతో సంతోషంగా వ్యవసాయం చేస్తున్నం.

*– జోరు ప్రభాకర్, కాశీంపల్లి, జయశంకర్ భూపాలపల్లి*

## 10హెచ్‌పీ మోటరుకు ఎవరు డబ్బు లియ్యాలె ?



గోవిందరావుపేట, నవంబర్ 21: వరి సాగుపై కాంగ్రెసోళ్లకు అవగాహన లేదు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అని, 10హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని చెప్పడం సిగ్గుచేటు. నాకున్నది ఎకరంన్నర పొలం. అందులో వరి సాగు చేస్తన్న. కేసీఆర్ సారు కరెంట్ 24గంటలు ఇస్తుండడంతో చిన్న మోటరు తోనే పొలం మొత్తం పారిస్తున్న. రేవంత్‌రెడ్డి చెప్పే మూడు గంటల కరెంట్‌కు నేను 10హెచ్‌పీ మోటరు ఎలా కొనుక్కోవాలే. డబ్బులు ఎవలు ఇస్తరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్ మాకు ఎంతో ఉపయోగపడుతుంది.

*– దామళ్ల కాంతమ్మ, గోవిందరావుపేట*



## కాంగ్రెస్ మాటలు నమ్మితే పాత కథే..

మల్హర్, నవంబర్ 21 : ధరణిని తొలగిస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నరు. రైతులను ఇబ్బందులపాలు చేయడం వారికి మామూలే. తెలంగాణ రాక ముందు పట్వారీ వ్యవస్థ ఉండే. పైసల కోసం ఇష్టం వచ్చినోళ్ల పేర్ల మీద భూములు మార్చేటోళ్లు. అన్నదాతలను అరిగోస పెట్టేటోళ్లు. ఇప్పుడు వాళ్లని నమ్మితే మళ్లా పాత కథే మొదలైతది. సీఎం కేసీఆర్ సారు తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మేలు జరుగుతున్నది. ఇట్లా పోయి అట్లా పని చేసుకొని వస్తున్నం. ధరణిని తొలగిస్తే మళ్లీ పాత రోజులే వస్తయ్. పహాణీల కోసం రోజుల తరబడి తహసీల్ చుట్టూ తిరగాల్సి వస్తది. లంచాలు ఇవ్వాల్సి వస్తది. రైతులంతా కూలీ పనులకు పోవుడు అయితది. ఆ పార్టీని నమ్మి కష్టాలు కొని తెచ్చుకోవడం దేనికి. మా కోసం పని చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలిపించుకుని కేసీఆర్ సారును సీఎం చేస్తం. ఆయన రైతుల కోసం మరిన్ని పథకాలు తెస్తడు. ఆయన మనసంతా రైతులమీదనే ఉంటది. అడగకుండానే అన్నీ ఇస్తడు.

*– చెన్నూరి దేవదానం, తాడిచర్ల, జయశంకర్ జిల్లా*

## పట్వారీ వ్యవస్థ తెచ్చి ఏం చేస్తరు



కాటారం, నవంబర్ 21 : కాంగ్రెస్‌కు ఓటేస్తే ధరణి పూర్తిగ తీసేత్తమని చెబుతున్నరు. ఇప్పుడు ధరణి వల్ల ఇబ్బందులైతే ఏం లేవు. కబ్జాదారులకు ఉంటే ఉండొచ్చు. అంటె పాత పట్వారీ వ్యవస్థ తెత్తే ఇక భూముల కబ్జాలకు ఢోకా ఉండదనా ఏందీ. కౌలుదారు చట్టం తెస్తే నష్టం తప్ప లాభమేమీ ఉండదు. అప్పుడు భూములకు రక్షణ ఉండదనుకుంటున్న. మధ్యల కబ్జాదారులు అచ్చి భూములను తన్నుకపోతరు. ధరణి ఉండడం వల్ల అలాంటి ఆటలు సాగుతలేవోమో. ఇప్పుడు ఎవ్వరి భూములకు వాళ్లకు హక్కులు, రక్షణ ఉన్నవి. ఇవి తీసేసి పాత పద్ధతి తెస్తామంటే.. పాత రోజుల్లా రైతుల బతుకులు ఆగమయ్యేవి. అంటే ఇప్పుడు మళ్లీ ఆగం జేత్తమని చెప్పకనే చెబుతున్నరు. అధికారం రానే లేదు. ఇప్పుడే బాజాప్తుగా చెప్తుంటే.. రేపు ఒకవేళ ఓటు వేస్తే ఆగుతరా కాంగ్రెసోళ్లు అన్న అనుమానం వత్తాంది.

*– తూటి మనోహర్, దేవరాంపల్లి, కాటారం*

## త్వరగా పట్టా మార్పిడి



వెంకటాపూర్, నవంబర్ 21 : ధరణి వల్ల నా భర్త పేరు మీద భూమి నా పేరుపై ఒకే రోజులోనే మార్పిడి జరిగింది. నా భర్త యాదగిరి ప్రమాదవశాత్తు చనిపోవడంతో ఆయన పేరుపై ఉన్న పట్టాపాస్ బుక్కుల మార్పిడి కోసం సంబంధిత కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్, డెత్ సర్టిఫికెట్స్ సమర్పించి మీసేవలో దరఖాస్తు చేసుకున్న వెంటనే నా పేరుపై మారాయి. పంట పెట్టుబడికి రైతుబంధు కూడా ఇస్తున్నారు. ధరణి పోర్టల్ వల్ల ప్రతీది భద్రంగా జరుగుతుంది. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తమనుడు సరికాదు. దాని వల్ల రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నయ్. లేకపోతే తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సి వస్తది. దళారుల వ్యవస్థ వచ్చి పేదోళ్లను పీల్చుక తింటరు. ధరణి కొనసాగలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలె. సీఎం కేసీఆర్‌కే మా ఓటు వేసి మద్దతు తెలుపుతం.

*– దండేపెల్లి స్వరూప, వెంకటాపూర్*

## కాంగ్రెస్ నేతలను ఓటుతో తరిమికొడుతం

టేకుమట్ల, నవంబర్21: రైతులపై కాంగ్రెసోళ్లది నీతిమాలిన ఆలోచన. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వల్ల రైతులకు లాభం జరుగుతుంది. గత 60 సంవత్సరాల నుంచి ఏ ప్రభుత్వానికి లేని ఆలోచన సీఎం కేసీఆర్‌కు వచ్చి మా భూములు మాపేరు మీద ఎక్కిచ్చిండు. సీఎం కేసీఆర్ సార్ దయతో రైతబంధు తీసుకుంటున్నం. కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయం కోసం ధరణి పోర్టల్ తీసేస్తానని అంటున్నది. ధరణి పోర్టల్ ద్వారా భూములను పట్టాలు చేపించుకొని రైతులు దర్జాగా వ్యవసాయం చేసకుంటున్నరు. ధరణి తీసేస్తే రైతులు వ్యవసాయం మానేసి తహసీల్దార్ కార్యాలయం, పట్వారీ చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి వస్తది. రైతులు బాగుపడితే ఓర్వలేని ఢిల్లీ నేతలు మళ్లీ పాత తెలంగాణను తీసుకురావాలని చూస్తన్నరు. వారిని ఓటుతో తరిమికొడుతం.



*– శాస్త్రాల పైడయ్య, పెద్దంపల్లి, టేకుమట్ల*